క్లుప్తంగా

పశుపోషకులకు అవగాహన



బూదవాడ(జగ్గయ్యపేట): మండలంలోని బూదవాడలో గరికపాడు కృషి విజ్ఞానకేంద్రం, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. కేవీకే పశు వైద్యుడు జశ్వంత్‌రెడ్డి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పశువుల్లో వచ్చే వ్యాధులు, నివారణ చర్యలపై పశుపోషకులకు అవగాహన కల్పించారు. అనంతరం పశువుల దాణా, మందులు పంపిణీ చేశారు. కేవీకే కోఆర్డినేటర్ కృష్ణంరాజు, అల్ట్రాటెక్ కర్మాగారం సీఈవో రాజేష్, రైతులు పాల్గొన్నారు.

రూ.25వేలు విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామానికి చెందిన కాకాని మాధవరావు, వెంకటేశ్వరి దంపతులు శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలోని అంకమ్మవారి ఉపాలయం వెండిగోపురం తయారీకి రూ.25వేలు విరాళంగా అందజేశారు. ఈమేరకు నగదును ఆలయ అధికారులకు అందజేశారు.

చిరుధాన్యాలతో ఎంతో మేలు



కొణకంచి(పెనుగంచిప్రోలు): సంపూర్ణ పోషణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో చిరుధాన్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి మాట్లాడుతూ రాగులు, పెసలు, సజ్జలు, జొన్నలు, సామలు తదితర చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలన్నారు. ఎముకల పుష్టి, పిల్లల ఎదుగుదలకు చిరుధాన్యాలు చక్కటి ఆహారమని పేర్కొన్నారు. రక్తహీనత నివారణ, గుండె జబ్బులు, మధుమేహం నివారణ దోహదపడతాయని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం రమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్‌లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిన గాలింపు చర్యలు

నందిగామ టౌన్: పందెం కాసి మున్నేటిలో దూకి గల్లంతైన నందిగామవాసి గోపి ఆచూకీ లభ్యం కాలేదని తహసీల్దార్ సురేష్‌బాబు తెలిపారు. వరద ప్రవాహం అధికంగా ఉండటంతో గల్లంతైన వ్యక్తి ఆచూకీ దొరకడం కష్టంగా మారిందన్నారు. వరద ప్రవాహం తగ్గిన తర్వాత గాలింపు చేపడతామన్న ఎన్‌డీఆర్ఎఫ్ సభ్యుల సూచనల మేరకు బుధవారం గాలింపు నిలిపివేసినట్లు వివరించారు.

నాలుగురోజుల తర్వాతే ఇసుక విక్రయాలు

జగ్గయ్యపేట: మండలంలోని అనుమంచిపల్లి ఇసుక స్టాకు యార్డు వద్ద 11రోజులుగా ఇసుక విక్రయాలు నిలిచిపోయాయి. భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకే ఇసుక విక్రయాలు నిలిపివేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మరో నాలుగైదు రోజుల తర్వాత ఇసుక విక్రయాలు ప్రారంభమవుతాయని వివరించారు.

వరద ముంపుతో భారీ నష్టం

- నందిగామలో ముంపునకు గురైన 3,800 ఇళ్లు
- పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు 2,600
- ఛిద్రమైన రోడ్లు
- దెబ్బతిన్న మంచినీటి పథకాలు
- మున్సిపాలిటీకి రూ.2.70కోట్ల నష్టం



పల్లగిరి సమీపంలోని మున్నేటిలో మంచినీటి పథకం కొట్టుకుపోయిన ప్రాంతం

నందిగామ టౌన్: ఇటీవల కురిసిన వర్షాలు...సంభవించిన వరదలకు నందిగామ ప్రజలకు తీరని నష్టం వాటిల్లింది. ప్రతి ఒక్కరికి నష్టాలనే మిగిల్చింది. ముంపు సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వ పాలకులు, అధికారులు పూర్తిగా విఫలం కావడంతో ప్రజలకు అవస్థలు తప్పలేదు. అంతేకాకుండా రైతులు పంట నష్టపోగా, ప్రజల ఇళ్లు ధ్వంసమయ్యాయి. పురపాలక సంఘానికి రూ.2.70కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ వరద ఉధృతికి పట్టణంలోని ప్రధాన రహదారులు ధ్వంసంకాగా మంచినీటి పథకాలు, పైప్‌లైన్లు దెబ్బతిన్నాయి. దీంతో నందిగామ పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేయలేని దుస్థితి నెలకొంది.

కొట్టుకుపోయిన మంచినీటి పథకం..

వరద ధాటికి పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే మంచినీటి పథకాలు కొట్టుకుపోయాయి. పట్టణానికి మంచి నీటిని సరఫరా చేసేందుకు పల్లగిరి సమీపంలోని మున్నేటిలో ఏర్పాటు చేసిన మంచినీటి పథకం పూర్తిగా కొట్టుకుపోవటంతో పాటు పథకానికి సంబంధించిన బోర్‌వెల్స్, పైప్‌లైన్లు, విద్యుత్ తీగలు, మోటార్లు, పవర్ ప్యానల్స్, ట్రాన్స్‌ఫార్మర్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కీసర సమీపంలోని మున్నేటిలో ఏర్పాటు చేసిన తాగునీటి పథకం కూడా పాక్షికంగా దెబ్బతింది. దీంతో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తడంతో కొన్ని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణంలో 2.80కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసంకాగా 1.80కిలోమీటర్ల మేర డ్రైయిన్లు, 2.60కిలోమీటర్ల పొడవునా మంచినీటి పైప్‌లైన్, 145 వీధిలైట్లు దెబ్బతిన్నట్లు సమాచారం.

పారిశుద్ధ్య పనులకు రూ.12లక్షలు, పైపులైన్ పునరుద్ధరణకు రూ.1.50కోట్లు, సైడ్‌డ్రెయిన్ల మరమ్మతులకు రూ.25లక్షలు, రోడ్ల మరమ్మతులకు రూ.76లక్షలు, వీధిదీపాల ఏర్పాటుకు రూ.7లక్షలు అవసరమవుతాయని మున్సిపల్ అధికారులు అంచనా వేశారు.

3,800 గృహాలకు వరద ముంపు..



రైతుపేట డౌన్‌లోని జనావాసాల మధ్య నిలిచిన వరద నీరు

పట్టణంలోని 12ప్రాంతాల్లోని 3,800 గృహాలు ముంపునకు గురికాగా, 2,600 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. పట్టణంలోని హనుమంతపాలెం, హనుమంతపాలెం ఎస్సీకాలనీ, కుమ్మరి బజారు, సిద్ధార్థగర్, అనాసాగరం జగనన్న హౌసింగ్ కాలనీ, హరిజనవాడ, బీసీ కాలనీ, అనాసాగరం డీవీఆర్ కాలనీ, బాబురావు చర్చి, బెతెస్థ చర్చి, డీవీఆర్ కాలనీతోపాటు 18వ వార్డులోని పలు ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యాయి. పూర్తిగా వరద ముంపుకు గురైన ప్రాంతాలలోని 800 మందికి పైగా ప్రజలను పట్టణంలోని బాబుజగ్జీవన్‌రాం భవన్, కేంద్రీయ విద్యాలయం, అనాసాగరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు.



వరద నీటిలో ఉన్న మంచినీటి పథకం ట్రాన్స్‌ఫార్మర్, పవర్ ప్యానల్స్

రూ.2.70కోట్ల నష్టం అంచనా..



నందిగామలో కోతకు గురైన రోడ్డు, దెబ్బతిన్న పైపులైన్

వరదల ఆకారణంగా నందిగామ పురపాలక సంఘానికి వాటిల్లిన నష్టంపై అధికారులు ప్రాథమిక అంచనాలు సిద్ధం చేశారు. రహదరులు, పైప్‌లైన్లు, డ్రైయిన్ల పునరుద్ధరణకు రూ.2.70కోట్లు ఖర్చవుతుందని అధికారులు లెక్కించారు.

బాధితులను ఆదుకోవాలి..



భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రజలు నానాఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని చాలా ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యాయి. ఇళ్లు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి వరద బాధితులను ఆదుకోవాలి.

– బండారు వెంకట్రావ్, నందిగామ

పునరుద్ధరణ పనులు చేపట్టాలి..



ఇటీవల సంభవించిన వరదల కారణంగా రహదారులు, డ్రైయిన్లు దెబ్బతిన్నాయి. మంచి నీటి పథకాలు మరమ్మతులకు గురికావడంతో పట్టణ ప్రజలు మంచినీటికి అవస్థలుపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి ప్రజలకు వసతులు కల్పించాలి.

– దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నందిగామ

సహనాన్ని చేతగానితనంగా చూడొద్దు

టీడీపీ నేతలకు మాజీఎమ్మెల్యే హెచ్చరిక



ఏసీపీ డాక్టర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, నాయకులు

నందిగామ టౌన్: శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా టీడీపీ నేతలు రాజకీయ ప్రేరేపిత ఘర్షణలకు పాల్పడుతున్నారని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. అధికారంలోకి వచ్చినప్పటినుంచి టీడీపీ కూటమి నాయకులు సాగిస్తున్న అరాచకాలపై నాలుగు మండలాలపార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం ఆయన ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏసీపీ స్పందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాడులు, ప్రతి దాడులకు పాల్పడకుండా రాజకీయ నాయకులు సంయమనం పాటించాలని సూచించారు.

ఇష్టారీతిన వ్యవహరించడం తగదు..

అనంతరం మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు విలేకరులతో మాట్లాడుతూ అధికారం ఉందనే అహంకారంతో టీడీపీ నేతలు ఇష్టా రీతిన వ్యవహరిస్తున్నారన్నారు. గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. విగ్రహాలు, శిలాఫలకాలు ఏం చేశాయని దాడులకు పాల్పడుతున్నారో అర్థంకావడం లేదన్నారు. విగ్రహాలను ధ్వంసం చేయడం, చెప్పుల దండలు వేయడం వంటి చర్యలు దివంగత నేతలను అగౌరవపరచడమేనన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో ఇటువంటి అనైతిక చర్యలకు పాల్పడలేదని గుర్తుచేశారు. దాడులకు పాల్పడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేస్తే తిరిగి తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

నందిగామకు చెడ్డపేరు రాకూడదనే..

టీడీపీ నేతల అరాచకాలను ప్రతిఘటించి ఘర్షణ వాతావరణం సృష్టించి నందిగామకు చెడ్డపేరు తీసుకురావడం ఇష్టంలేకనే సంయమనం పాటిస్తున్నామని జగన్‌మోహనరావు పేర్కొన్నారు. ప్రజలకు శాంతియుత జీవనాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మా సహనాన్ని చేతకానితనంగా భావించవద్దని ఇకపై దాడులకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా టీడీపీ నేతలు వారితీరు మార్చుకోవాలని హితవు పలికారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మంచాల చంద్రశేఖర్, వేమా సురేష్‌బాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, ఎంపీపీ ఆకుల హనుమంతరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, జెడ్పీటీసీమాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, నాయకులు బండి మల్లికార్జునరావు, పరిటాల రామకోటేశ్వరరావు, వేల్పుల రమేష్, పెరమసాని నరసింహారావు, రాయల నరసింహారావు, షేక్ జాఫర్, కొమ్ము విజయరాజు, పాకాలపాటి కిరణ్, పూలా రాంబాబు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా



గండేపల్లి(కంచికచర్ల) :మండలంలోని గండేపల్లిలో రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన పైపులైన్ వరద ఉధృతికి కొట్టుకుపోయిన నేపథ్యంలో గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేపట్టారు. ప్రతి వార్డుకు మూడు ట్రాక్టర్ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. వారం రోజులుగా గ్రామస్తులకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు సర్పంచి బొక్కా రవికుమార్ తెలిపారు. పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. మంచినీటి సరఫరాను పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ పర్యవేక్షించారు.

ముంపు పొలాల పరిశీలన

వీరులపాడు: అకాల వర్షాలు, వరదలతో రైతులు పంటలు నష్టపోవడం బాధాకరమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మండలంలోని అల్లూరు, పెద్దాపురం, జుజ్జూరు, వెల్లంకి గ్రామాలలో ముంపునకు గురైన పంట పొలాలను అధికారులతో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఇటువంటి విపత్తును చూడలేదన్నారు. పంట నష్టపోయిన ప్రతి ఒక్క రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ రాజకిషోర్, ఏవో జోగేంద్ర ప్రసాద్, టీడీపీ నాయకులు శ్రీనివాసరావు, గురజాల అజయ్ కుమార్, దాములూరు మధుసూదనరావు, భరత్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం : సీఐటీయూ

నందిగామ టౌన్: వరద బాధితులకు సహాయక చర్యలు చేపట్టడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ జిల్లా నాయకుడు గోపాల్ విమర్శించారు. వరద ముంపు కారణంగా ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ఇబ్బందిపడుతున్న మున్సిపల్ కార్మికులకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆయన బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాలలోని వందలాది మంది ఇళ్లు ముంపునకు గురయ్యాయన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి సహాయక చర్యలు అందించలేదని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ముంపునకు గురైన ఇళ్ల మరమ్మతులకు రూ.25వేలతోపాటు నిత్యావసర సరుకులు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చనుమోలు సైదులు, హనుమంతరావు, వెంకటేశ్వరరావు, ఏసోబు, యుటీఎఫ్ నాయకుల కుంచం లక్ష్మీనారాయణ, మహేశ్వర వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

నందిగామ టౌన్: వినాయక నిమజ్జనాలకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రమణబాబు తెలిపారు. పట్టణ సమీపంలోని మున్నేటి పెద్దబ్రిడ్జి వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జనాలకు అవసరమైన ఫ్లడ్‌లైట్లు, బారికేడ్లు, తగిన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. పోలీస్ అధికారుల సూచనల మేరకు నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ ఫణి శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు



పేటలో ప్రత్యేకాకర్షణగా గుహ వినాయకుడు



పెనుగంచిప్రోలు వేణుగోపాలస్వామి ఆలయంలో..



పెనుగంచిప్రోలు డౌన్ సెంటర్‌లో పూజలందుకుంటున్న గణనాథుడు

జగ్గయ్యపేట అర్బన్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగ్గయ్యపేట పట్టణంలో ఐదోరోజు బుధవారం వినాయకుడి మండపాల వద్ద స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వైవై కాలనీ, విశ్వబ్రాహ్మణ వీధి, బ్రాహ్మణ బజారులో చేసిన గణనాథులతోపాటు ఆయా వినాయకుడి మండపాలను భక్తులు సందర్శించి పూజలు చేశారు. గణేష్ మందిరంలో స్వామివారికి గరికె పూజ నిర్వహించగా, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన మండపంలోని గుహ వినాయకుని విగ్రహం ప్రత్యేకాకర్షణగా నిలిచింది.

పెనగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: గణపతి నవరాత్రులను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పెనుగంచిప్రోలుతో పాటు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకచవితి పందిళ్లను భక్తులు సందర్శించి గణనాథులకు బుధవారం విశేష పూజలు చేశారు.



పేటలో వినాయకుడికి పూజలు చేస్తున్న మాజీమంత్రి నెట్టెం రఘురాం, నాయకులు



జగ్గయ్యపేట బ్రాహ్మణబజారులో..

నందిగామలో...

నందిగామ టౌన్: గణనాథుని మండపాల వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం నందిగామ ముక్కోటి మహామండపంలోని గణనాథునికి గరిక, పూలతో అర్చనలు చేశారు. కేరళ నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన 120 కిలోల ఆర్గానిక్ బెల్లంతో అష్టోత్తర సహస్రనామ పూజలు చేశారు. రైతుపేటతోపాటు మండలంలోని గోళ్లమూడి, దాములూరు గ్రామాలలో కొలువుదీరిన వినాయక ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మేళతాళాలతో నిమజ్జనానికి తరలించారు.



పేట విశ్వబ్రాహ్మణ వీధిలో ..

వినాయకుడి నిమజ్జనం



కంచికచర్ల : మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన గణనాథుడిని బుధవారం నిమజ్జనం చేశారు. తొలుత గణనాథుడికి కళాశాల కరస్పాండెంట్ కే రామ్మోహనరావు, సీఈఓ కె.సాయిమనోజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ ప్రత్యేక పూజలు చేశారు.

స్వామివారి లడ్డు వేలం నిర్వహించగా సీఎస్‌సీ విభాగం కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అనంతరం గణేషుడి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు ట్రాక్టర్‌పై కృష్ణానదికి తరలించారు. జైబోలో గణేష్ మహరాజ్‌కి జై అంటూ విద్యార్థులు కేరింతలు కొట్టారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి, విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేట : మిట్టగూడెం సమీపంలో పాలేరులో కొట్టుకుపోతున్న వరిగడ్డి వాములు



కంచికచర్ల మండలం గనిఆత్కూరులో వరదనీటిలో ఉన్న జొన్నగడ్డి చేను



కంచికచర్ల మండలం కొత్తపేటలో రోడ్డుపై ఆరబెట్టిన వరిగడ్డి

వరద బీభత్సం.. పశువుల మేతకు కష్టం

ఇటీవల సంభవించిన భారీవర్షాలకు జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని పాలేరు, మునేరుతోపాటు వాగులు పొంగి ప్రవహించడంతో వరిపొలాలు దెబ్బతిన్నాయి. గ్రామాల్లో పశుపోషకులు నిల్వచేసిన వరిగడ్డి వాములు, గడ్డికట్టలు కూడా కొట్టుకుపోయాయి. వరదలకు సాగుచేసిన పచ్చిగడ్డి పొలాలు దెబ్బతినగా, గత వరికోతల సమయంలో బేలర్ యంత్రం సాయంతో కట్టలు కట్టించిన వరిగడ్డి సైతం వర్షాలకు తడిసి కుళ్లిపోయింది. దీంతో పశుపోషకులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇప్పటికే ఎకరా వరిగడ్డి రూ.5వేలు నుంచి రూ.6వేలు పలుకుతుండగా, ఈ వరదల ఉధృతి వేలాది ఎకరాల్లోని వరి పంట దెబ్బతినడంతో గడ్డి రేట్లు ముందు మరింత పెరుగుతాయని సుబ్బాయిగూడెం గ్రామానికి చెందిన పశుపోషకురాలు అమీనా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించడంతోపాటు సబ్సిడీపై పశుగ్రాసం అందించాలని పాడిరైతులు కోరుతున్నారు.

– కంచికచర్ల, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు



పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదుర్రు వద్ద నీటిలో నాని కుళ్లిపోయిన వరిపైరు



పెనుగంచిప్రోలు మండలం సుబ్బాయిగూడెం వద్ద వరదకు కొట్టుకువచ్చి కుళ్లిపోయిన వరిగడ్డి కట్టలు



కంచికచర్ల మండలం కీసరలో వరద ఉధృతికి దెబ్బతిన్న వరిచేను

బాధితుల కోసం విరాళం



జగ్గయ్యపేట అర్బన్: వరద బాధితుల సహాయార్థం స్థానిక 9,10వ వార్డులకు చెందిన అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు రూ.10,116లను విరాళంగా అందజేశారు. ఈమేరకు నగదును జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) నివాసంలో అంగన్‌వాడీ కార్యకర్త కె.సీతామహాలక్ష్మి బుధవారం ఆయనను కలిసి అందజేశారు. వరద బాధితులకు ఆర్థికసాయం అందించిన చిన్నారులతోపాటు అంగన్‌వాడీ కార్యకర్త సీతామహాలక్ష్మిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మేకా వెంకటేశ్వర్లు, పున్న ఉపేంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.వెంకటరమణ, కె.శ్రీదేవి పాల్గొన్నారు.